



సీఎం సొంతూరు నారావారిపల్లెకు సంక్రాంతి శోభ వచ్చింది. సీఎం చంద్రబాబు కుటుంబీకుల రాకతో సందడి నెలకొంది. సంప్రదాయబద్ధంగా ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మరోవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. సంక్షేమ కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ ఆయన సోమవారమంతా బిజీగా గడిపారు.



వివిధ పనులకు శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

నారావారిపల్లెకు సంక్రాంతి శోభ

- అటు ఆటలు, ముగ్గుల పోటీలు
- ఇటు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కుటుంబీకులు, గ్రామస్తులతో ఉల్లాసంగా గడిపిన సీఎం చంద్రబాబు



పిల్లలతో కలిసి దేవాన్ష్ సందడి



ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ కుమారుడు అయిన నారా దేవాన్ష్ గ్రామంలోని పిల్లలతో కలిసిపోయి ఆటలాడాడు. ఉదయం 9 గంటల నుంచి వీరి ఇంటికి సమీపంలో క్రీడాపోటీలకు సిద్ధం చేసిన ప్రదేశంలో తోటి విద్యార్థులతో కలిసి తిరుగుతూ కనిపించాడు. 'మీకు ఏ కలర్ అంటే ఇష్టం? మీరు ఏ ఆట ఆడతారు' అంటూ అక్కడే ఉన్న విద్యార్థులతో మాట్లాడాడు. వారితో కలిసి ఎక్కువ సమయం ఆడుకున్నాడు. కొంత సేపు ఫుట్‌బాల్, పరుగు పందెం ఆడాడు. బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజిక్ చైర్, గోతాలతో రన్నింగ్ వంటి క్రీడాపోటీల్లోనూ పాల్గొన్నాడు. ఒకట్రెండు పోటీలకు సంబంధించి ప్రోత్సాహక బహుమతులూ అందుకున్నాడు. సంక్రాంతికి ప్రత్యేకంగా తయారు చేసిన ఎద్దుల బండెక్కి గ్రామంలో చక్కర్లు కొట్టాడు.

ఆసక్తిగా ఆటలు

విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలను కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు తిలకించారు. బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజికల్ చైర్స్, పొటాటో కలెక్ట్, గోతాల జంపింగ్ వంటి పోటీల్లో స్థానిక పిల్లలతో కలిసి నారా దేవాన్ష్ కూడా ఉత్సాహంగా పాల్గొన్నాడు. విజేతలకు తన సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు బహుమతులు అందించారు. బహుమతుల ప్రదానం సమయంలో వేదికపైనే ఉన్న మంత్రి నారా లోకేశ్.. కాసేపు మైక్ చేతపట్టి సందడి చేశారు.

నేడు సీఎం తిరుగు ప్రయాణం

తిరుపతి (నేరవిభాగం), జనవరి 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి జిల్లా యంత్రాంగానికి అధికారిక సమాచారం అందింది. అలాగే, సీఎంతో పాటు మంత్రి నారా లోకేశ్ కూడా విజయవాడకు తిరుగు పయనం కానున్నట్లు తెలిసింది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామంలో ఉండేందుకు వీరు కుటుంబీకులతో కలిసి ఆదివారం నారావారిపల్లెకు చేరుకున్న విషయం తెలిసిందే. తొలుత బుధవారం తిరుగు ప్రయాణమవుతారని షెడ్యూల్ రాగా.. ఇప్పుడు మంగళవారమే బయలుదేరనున్నారు.



సూక్ష్మసేద్య పరికరాల లారీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న చంద్రబాబు

తిరుపతి(వైద్యం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భోగి పండుగ రోజైన సోమవారం సీఎం చంద్రబాబు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేర్ అండ్ గ్రోతో ఇప్పటికే కుప్పంలో 480 కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను చేపడుతూ పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని సీఎం చంద్రబాబు అన్నారు. తిరుపతి జిల్లాలోనూ పైలట్ ప్రాజెక్టు కింద నారావారిపల్లె పరిధిలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, కేర్ అండ్ గ్రో మధ్య ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సూక్ష్మ నీటి సాగు పథకం కింద బలరాం నాయుడు, జ్యోతికి డ్రిప్ పరికరాలను అందజేశారు. ఈ ప్రాజెక్టు కింద అర్హులందరికీ సాయం అందేలా చూడాలని ఏపీఎం



ఐసీ అధికారి సతీష్‌ను ఆదేశించారు. నారావారిపల్లెలో రూ.4.27 కోట్లతో నిర్మించనున్న 33 కేవీ సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద మూడు సచివాలయాల పరిధిలో రూ. 3.21 కోట్లతో 26 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎ.రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలను స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శవంతమైన పాఠశాలగా శ్రీసిటీ సౌజన్యంతో రూ.1.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, ఏఐ రోబోటిక్ ల్యాబ్, క్రీడా సామగ్రి తదితర పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళలు ఇంటి నుంచే కిరాణా దుకాణాలకు వస్తువులను సరఫరా చేసి ఆర్థిక స్థితిగతులు మార్చుకునేలా ఈజీమార్ట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు డీఆర్డీఏ, వెలుగు సంస్థలు ముఖ్యమంత్రి సమక్షంలో ఎంవోయూ చేసుకున్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టరు వెంకటేశ్వర్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మీ, డీఆర్డీఏ పీడి శోభన్‌బాబు, ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, డీపీవో సుశీలదేవి, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల రేవాండ్స్ సంస్థ సీఈవో దామోదర్, ఈజీమార్ట్ ఫౌండర్ అండ్ సీఈవో వెంకట్, టీడీపీ నేతలు నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



అలరించిన ముగ్గుల పోటీలు

నారావారిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. విజేతలను ఎంపిక చేశారు. అనంతరం 10.30 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చిన సీఎం చంద్రబాబు ముగ్గులను పరిశీలించారు. అనంతరం సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణీతో కలిసి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని తనుశ్రీ, గాయత్రి.. ద్వితీయ, తృతీయ బహుమతులను బి.నాగలక్ష్మి, ఎం.పూజిత అందుకున్నారు. అందరితో కలిసి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని భువనేశ్వరి అన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 126 మందికీ ప్రోత్సాహంగా రూ.10,116 చొప్పున బహుమతి ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఇలా మరెన్నో పండుగలు మీతోనే కలిసి జరుపుకోవాలని కోరుకుంటున్నాని నారా బ్రహ్మిణి అన్నారు.

మ్యాట్రిమోని సైట్‌లో పరిచయం

● రెండో పెళ్లికి సిద్ధమన్న ఢిల్లీ యువతి ● సంపాదనను షేర్‌లో పెట్టుబడిగా పెట్టాలని సూచన
● తిరుపతిలో డాక్టరు నుంచి రూ.84 లక్షలు కొట్టేసిన వైనం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 13(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు పలువిధాలుగా మారాయి. రెండో పెళ్లి ప్రయత్నాల్లో పరిచయమైన ఓ యువతి.. చివరకు సైబర్ క్రైంకు పాల్పడి రూ.84 లక్షలు కొట్టేసింది. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. తిరుపతిలో ప్రైవేటు ప్రాక్టీస్ ప్రాక్టీసు చేస్తున్న డాక్టరు.. కుటుంబ సమస్యల నేపథ్యంలో భార్య నుంచి విడిపోయారు. రెండో పెళ్లి కోసం ఇటీవల మ్యాట్రిమోని సైట్‌లో తన వివరాలు పెట్టారు. దీన్ని గమనించిన ఢిల్లీకి చెందిన ఒక యువతి ఆన్‌లైన్ ద్వారా పరిచయమైంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన తనకు నెలకు రూ.1.5 లక్షల జీతం వస్తోందని చెప్పింది. అందంగా ఉన్న ఫొటోలు పెట్టింది. ఇద్దరూ కలసి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నెలకు అతడికి వచ్చే ఆదాయాన్ని తెలుసుకుంది. సంపాదనంతా వృథా ఎందుకు చేస్తున్నావని చెప్పి మాయమాటలు చెప్పింది. డబ్బులు అకౌంటులో ఉంచకుండా, ఫెడెక్స్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే రెండు మూడేళ్లకు దాదాపు ఐదు నుంచి ఆరు కోట్ల రూపాయలు వస్తాయని చెప్పింది. దీనికోసం ఆ యువతి రెండు నకిలీ యాప్‌లు పంపింది. తన ఖాతాలో ఉన్న దాదాపు రూ.84 లక్షలను ఆమె చెప్పినట్లుగా షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టారు. కొద్ది నెలలకే ఆ నకిలీ యాప్‌లో ఇతడి పెట్టుబడి రూ.9 కోట్లకు పెరిగినట్లు చూపించింది. ఈ మొత్తంలో నుంచి రూ.5 కోట్లు డ్రా చేయడానికి ఆయన ప్రయత్నించారు. మీరు దాదాపు రూ.రెండు కోట్ల పన్ను చెల్లిస్తే అకౌంటులో వున్న డబ్బులు డ్రా చేసుకోవచ్చని నిర్వాహకులు చెప్పారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన ఆ డాక్టరు.. అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



90 శాతం పోలీసులు మఫ్టీలోనే..



తిరుపతి(నేరవిభాగం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సోమవారం ఎక్కువ మంది పోలీసులు మఫ్టీలో ఉన్నారు. బందోబస్తు విధుల్లో పాల్గొన్న దాదాపు 800 మంది పోలీసులు సాధారణ దుస్తుల్లోనే కనిపించారు. దీనిపై ఒక పోలీసు అధికారిని సంప్రదించగా.. కుప్పం పర్యటన నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసులు యూనిఫాంలో రాకూడదని ఆదేశాలు అందాయన్నారు. గతంలో అయితే రిజర్వు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, సీఎం ప్రత్యేక బలగాలు సైతం మఫ్టీ డ్రస్‌లో కనిపించే వారు. ఈ సారి 90 శాతం మంది పోలీసులు మఫ్టీలో కనిపించడం గమనార్హం.



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు - అభిషేకం కోసం నీటిని కాస్తూ.. - పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

ఆగమోక్తంగా ఆరుద్ర అభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఆరుద్ర అభిషేకం ఆగమోక్తంగా జరిగింది. ధనుర్మాసంలో ప్రత్యేకించి వేడినీటి(ఉష్ణోదక)తో మూలవిరాట్‌ను అభిషేకించడం ఆనవాయితీ. ధనుర్మాసం పరమశివుడి జన్మ నక్షత్రమైన ఆరుద్రతో ఆయనకు ఎంతో ప్రీతికరమైన సోమవారం కలసి రావడంతో ఈ అభిషేకం ప్రత్యేక విశిష్టతను సంతరించుకుంది. వేకువజామున 3గంటలకు జేగంటలు మోగించి ఉత్సవం ఆరంభించారు. అనంతరం ఆలయంలో స్వామిఅమ్మవార్ల మేలుకొలుపు తరువాత 6గంటలకు నిజరూప దర్శనంతో లింగోద్భవ కాలాభిషేకం వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆచరించారు. ఆలయంలోపల కట్టెల పొయ్యిపై వేడినీటిని సిద్ధం చేశారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన వేడినీటితో ఉష్ణోదక అభిషేకం భక్తులకు కనువిందు చేసింది. అనంతరం నటరాజ స్వామికి గంధం, పసుపు, కుంకుమ, పంచామృతం, విభూది వంటి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీకొని 30 మందికి గాయాలు



కల్యాణి డ్యామ్ వద్ద ఢీ కొన్న బస్సులు - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చంద్రగిరి, జనవరి13(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిలో కల్యాణి డ్యామ్ మలుపు వద్ద రెండు బస్సులు ఢీకొని 30మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు సోమవారం తిరుపతి నుంచి పీలేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్యామ్ మలుపు వద్ద అదుపు తప్పింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈప్రమాదంలో మదనపల్లె డిపో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆ బస్ డ్రైవర్ వెంకరమణకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు బస్సుల్లో సుమారు 29 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ వెంకటరమణను అతి కష్టంపై బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రెండు బస్సులను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కాగా తలకోన సందర్శనకు వచ్చి తిరిగి కారులో వెళ్తున్న వైద్యులు సాయి, హరి, మణిలు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన బస్సు

● పలువురు భక్తులకు స్వల్ప గాయాలు



తిరుమల, జనవరి13 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్‌రోడ్డులో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పడంతో 13 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి డిపో బస్సు సోమవారం మధ్యాహ్నం 19 మంది భక్తులు, ఉద్యోగులతో తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరింది. ఘాట్‌మార్గంలోని 13వ కిలోమీటరు వద్ద బస్సు అదుపు తప్పికుడి వైపు కొండను ఢీకొంది. బస్ వెనుకభాగం రోడ్డుకు అడ్డంగా వెళ్లిపోయింది. దీంతో 13 మంది గాయపడ్డారు. మరో ఆరుగురు చిన్నపాటి చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. బస్సు రోడ్డుకు అడ్డుగా నిలిచిపోవడంతో వాహనాలన్నీ నిలిచిపోయాయి. దాదాపు అలిపిరి వరకు ట్రాఫిక్ స్తంభించింది. క్షతగాత్రులకు తిరుమలలో అశ్విని, తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. టీటీడీ ఆటోక్లినిక్, ట్రాఫిక్ పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకుని బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. ట్రాఫిక్ క్లియర్ చేశారు. ప్రమాద కారణాలపై డ్రైవర్ రవి, భక్తులను పోలీసులు విచారిస్తున్నారు.

నేటి సీఎం కార్యకర్యమాలిలా..

చంద్రగిరి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ గ్రామ దేవత దొడ్డి గంగమ్మను, కుల దైవం నాగాలమ్మను దర్శించుకోనున్నారు. అనంతరం చంద్రబాబు తల్లితండ్రులు నారా ఖర్జురపునాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు నివాళులర్పిస్తారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, బసవతారకం విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ విగ్రహావిష్కరణ సినీనటుడు, నందమూరి బాలకృష్ణ ఆవిష్కరించనున్నట్లు సమాచారం.

లడ్డూ కౌంటర్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

● విద్యుత్ సరఫరా నిలిపివేతతో తప్పిన ముప్పు



తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూకౌంటర్‌లో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. 47వ నంబరు కౌంటర్‌లోని కంప్యూటర్ వైర్ నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో కౌంటర్ల వద్ద భక్తులు భయభ్రాంతులయ్యారు. భారీ శబ్దాలతో మంటలు వస్తూ, ఆగుతున్న దృశ్యాలను చూసి ఆందోళన చెందారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్టు అధికారులు తెలిపారు. సిబ్బంది హుటాహుటిన విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వైర్లన్నీ తొలగించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విచారించాలని సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

సార్.. పక్షుల పండుగకు రండి



తిరుపతి(విద్య), జనవరి 13(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు జరిగే పక్షుల పండుగకు రావాలంటూసీఈఎం చంద్రబాబును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్, జిల్లా టూరిజం కౌన్సిల్ ఛైర్మన్ ఎస్.వెంకటేశ్వర్ ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం రాత్రి నారావారిపల్లెలో సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులున్నారు.

కాలినడకన తిరుమలకు క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి



తిరుమల, జనవరి13 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ యంగ్ క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డి సోమవారం కాలినడకన తిరుమలకు వచ్చా రు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా ఆయన సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం ఉద యం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి ఆలయం ముందు భోగి సంబరాలు



సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం ముందు సోమవారం వేకువజాము భోగి మంటలు వేశారు. ఆలయ మహద్వారం వద్ద టీటీడీ అధికారులు, సిబ్బంది సంప్రదాయంగా వేశారు. భక్తులు కూడా సంబరాల్లో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. ఛైర్మన్ కార్యాలయంలోనూ భోగి సంబరాలు జరిగాయి. బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, సిబ్బంది భోగిమంటలు వేశారు. తిరుమల బాలాజీనగర్‌లో స్థానికులు తమ ఇళ్ల ముందు భోగి వేయడంతో బాలాజీనగర్ మొత్తం సందడిగా మారింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సంక్రాంతి
మరియు జన్మదిన
శుభాకాంక్షలు.
RISING ANDHRA
SHINING ANDHRA
ప్రజా సంక్షేమమే లక్ష్యంగా , చితూరు అభివృద్ధికె నిరంతరం
శ్రామికుడి లాగా ముందుకు సాగుతున్న
చిత్తూరు శాసనసభ్యులు మా ఆత్మీయసోదరుడు
శ్రీ గురజాల జగన్మోహన్ గారికి
హార్థిక జన్మదిన శుభాకాంక్షలు.
N AVENUE BY KONDA & GJM , NUTRINE FACTORY COMPOUND , CHITTOOR
LAUNCHING SOON...
N AVENUE :
* Mall
* 3 Star Hotel
* Luxuary villas
* Commercial Space
* High Rise Appartments
మీ...
కొండా నరేంద్ర MS USA
గ్లోబల్ వెస్ ప్రెసిడెంట్ NIVIDIA సిలికాన్ వ్యాలి , USA
ప్రముఖ పారిశ్రామిక వేత్త , ప్రకృతి వ్యవసాయ నిపుణులు
తంబళ్ళపల్లి నియోజకవర్గం

ఘాట్‌రోడ్డులో ప్రయాణం భద్రం సుమా:టీటీడీ

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో దట్టమైన పొగమంచు కారణంగా ముందున్న వాహనాలు కనిపించడం లేదని, ఈక్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశమున్న నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలంటూ టీటీడీ సోమవారం ఓ ప్రకటన ద్వారా కోరింది. వాహనదారులందరు అప్రమత్తంగా వాహనాలను నడపాలని సూచన చేసింది. ఇక, తిరుమలనూ సోమవారం దట్టమైన పొగమంచు కప్పేసింది. ఉదయం నుంచి పలు దఫాలుగా వర్షం కురిసి నిలిచిన సందర్భాల్లో పొగమంచు క్షేత్రాన్ని కప్పేసింది.



శ్రీవారి ఆలయంపై పొగమంచు

అమ్మవారి సన్నిధిలో చాగంటి



తిరుచానూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తిరుచానూరులోని సూర్యనారాయణస్వామిని కూడా దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఆకెళ్ల విభీషణశర్మ ఉన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన రుద్రకోటి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్‌లను నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం సోమవారం నారావారిపల్లెలో మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. -చంద్రగిరి(ఆంధ్రజ్యోతి):

అనుపల్లిలో రంకేసిన కోడెగిత్తలు





అనుపల్లిలో జల్లికట్టు పోటీలో కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు- వేడుక చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

రామచంద్రాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని అనుపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన జల్లికట్టులో కోడెగిత్తలు రంకేశాయి. వేలాదిగా జనం తరలిరావడంతో వీధులన్ని కిక్కిరిసిపోయాయి. గ్రామస్థులు వారం నుంచి కోడెగిత్తలను జల్లికట్టుకు సిద్ధం చేశారు. సోమవారం గ్రామశివారులోని సత్తెమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. గిత్తల కొమ్ములకు బహుమతులతో పాటు వివిధ రాజకీయ, సినీ ప్రముఖుల ఫోటోలు కట్టి అల్లె వద్దకు తీసుకువచ్చారు. తర్వాత జల్లికట్టులో అవి పరుగులు తీస్తుంటే యువకులు వాటిని నిలువరించేందుకు ప్రయత్నించారు. కొమ్ములకు కట్టిన బహుమతులు చేజిక్కించుకుని ఉత్సాహంతో ఉరకలు వేశారు. ఈసందర్భంగా కొందరికి స్వల్పగాయాలు అయ్యాయి. ఆర్‌సీపురం, వడమాలపేట, చంద్రగిరి, తిరుపతి రూరల్‌తో పాటు ఉమ్మడిజిల్లా నుంచి సందర్శకులు తరలివచ్చారు. గ్రామస్థులు తాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేశారు.

అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్



అర్జీలు ఇవ్వడానికి సీఎం ఇంటి ముందున్న ప్రజలు

చంద్రగిరి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు నారావారిపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లను కలవడానికి సోమవారం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రాత్రి 7 గంటల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగృహంలోనే జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులకు పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం ఇంటి ముందు భారీగా ప్రజలు రావడంతో మంత్రి లోకేశ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యను తెలుసుకున్నారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు అర్జీలు స్వీకరించారు. ప్రజలు అర్జీలకు పరిష్కారం లభిస్తుందనే విశ్వాసంతో సంతోషంగా బయటకు వచ్చారు.

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం



పుత్తూరు టౌన్, జనవరి 13: పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గోదాదేవికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేసి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి రంగనాథుడి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదారులుగా సాయిరాం ట్రావెల్స్ హిమచలబాబు దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ సాళ్వాకం క్రిష్ణప్ప మెదలియార్, సభ్యులు దామోదరం, మునిచంద్ర పాల్గొన్నారు.

ఎంబీయూలో భోగి సంబరాలు



భోగి సంబరాల్లో మోహన్‌బాబు, కుటుంబ సభ్యులు

చంద్రగిరి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం(ఎంబీయూ)లో సోమవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువజామున విశ్వవిద్యాలయం ముందు సినీనటుడు, ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, మా అధ్యక్షుడు ఎంబీయూ ప్రోఛాన్సలర్ మంచు విష్ణులు కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంట వెలిగించారు. మోహన్‌బాబు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించాలన్నారు. ప్రోఛాన్సలర్ విష్ణు మాట్లాడుతూ బైరాగిపట్టెడ మాతృశ్య సంస్థకు చెందిన 120 మంది అనాథులను దత్తతకు తీసుకొన్నట్లు తెలిపారు. సంబరాల్లో మోహన్‌బాబు సతీమణి నిర్మల, విష్ణు సతీమణి వెరోనిక పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక సందడి



తిరుచానూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సోమవారం సంక్రాంతి సంబరాలు అలరించాయి. సాయంత్రం అన్నమయ్య కీర్తనలకు కళాకారులు ప్రదర్శించిన నాట్యం ఆహుతులను అలరించింది. కళాకారులు వినోద్, రంజిత, మహాలక్ష్మి, తనయ, స్వప్న, భవష్య, మోక్షశ్రీ తదితరులు గణేష్ స్తుతి, ఓం హరహరా, చిన్ని శిశువు, బ్రహ్మోత్సవం, దశవతారం వంటి కీర్తనలకు నృత్యం చేశారు. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.

కనువిందు చేసిన భరతనాట్యం



తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారి ఆలయం ముందున్న నాదనీరాజనం వేదికపై సోమవారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. బెంగుళూరుకు చెందిన సృష్టి కృష్ణన్ బృందం ఈప్రదర్శన ఇచ్చింది. త్యాగరాజు, అన్నమయ్య, పురందరదాసు రచించిన సంకీర్తనలకు అద్భుతమైన నృత్య భంగిమలతో ప్రదర్శన ఇచ్చి భక్తులను ఆకట్టుకున్నారు.

వైభవంగా శివ ముక్కోటి పూజలు



రామచంద్రాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వర, కోటిలింగేశ్వరాలయాల్లో శివ ముక్కోటి పూజలు జరిగాయి. 110 ఏళ్ల తరువాత భోగి, సోమవారం, పౌర్ణమి, ఆరుద్ర నక్షత్రం ఏకకాలంలో రావడంతో ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గర్భాలయంలో 108 శివలింగాలతో పాటు కోటి లింగేశ్వరస్వామికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. విశ్రాంత ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ ఏపీ నాయుడు, టీటీడీ విశ్రాంత ఉద్యోగి కటారి భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

పాకాల జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS No. 67/2023
Between
యు.జ్యోతి .... Petitioner
And
కె.రామమూర్తి, S/o కె.వెంకటరామయ్య, కొత్తపట్టిపల్లి గ్రామం, మద్దినాయనిపల్లిపోస్ట్, పాకాల మండలం .... ప్రతివాది

ప్రకటన
ఇందుమూలంగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా వాది అయిన యు.జ్యోతి గారి నుండి రూ. 75,000/- 29-04- 2014న తీసుకొని దావా షెడ్యూలు భూమిని Regd. Doc.No. 1132/2014న Simple Mortgage వ్రాయించి ఇచ్చివున్నావు. తదుపరి మీరు Mortgage నందు కనపరచిన కండీషన్ల మేరకు మీరు చేయనందుకు పైదావాను వాది పై కోర్టు నందు వేసివున్నాడు. మీ హాజరుకు గాను 03-02-2025న పై కోర్టు నందు ఉ॥ 10.30 గంటలకు మీరుగాని, మీ తరఫున న్యాయవాది ద్వారా గాని హాజరు కావలయును. అట్లు హాజరుకాని పక్షాన మీకు ప్రతికూలంగా తీర్పు వచ్చునని తెలియపరచడమైనది.
జె.ఎం.గౌరిశంకర్ రాజు, M.A., LLB
వాది తరఫు న్యాయవాది, పాకాల.

In the Court of the 5th Addl. Civil Judge (Junior Division) Tirupati.
O.S. No. 686 / 2023
T. Kaniyappan Mohan - *Plaintiff*
Vs
P. Kavitha & Others ...Defendents
SUIT SUMMONS TO THE DEFENDANT No.5
S. Dharani, D.No. 4-74, 1st Floor, Govindaraju Modali Street, Renigunta, Tirupati Dist.,
Plaintiff filed a suit against the defendants for recovery of arrears of rent amount Rs. 19,35,000 with interest and case is posted to 12-02-2025 for your appearance. You shall appear on 12.02.2025 at 10.30am either in person or by advocate if you failed to do so the case will be decided in your absence.
Sri N. Manohar, M.A., B.L.,
Advocate, TIRUPATI

పాకాల జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS No. 68/2023
Between
యు.జ్యోతి .... Petitioner
And
కె.శివకుమార్, ... కె. వెంకటరమణ, పార్కు వీధి, పాకాల టౌన్ .... Defendant

ప్రకటన
ఇందుమూలంగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా వాది అయిన యు.జ్యోతి గారి నుండి రూ. 1,00,000/- 05-02-2014న తీసుకొని దావా షెడ్యూలు భూమిని Regd. Doc.No.352/2014న Simple Mortgage వ్రాయించి ఇచ్చివున్నావు. తదుపరి మీరు Mortgage నందు కనపరచిన కండీషన్ల మేరకు మీరు చేయనందుకు పైదావాను వాది పై కోర్టు నందు వేసివున్నాడు. మీ హాజరుకు గాను 07-02-2025న పై కోర్టు నందు ఉ॥ 10.30 గంటలకు మీరుగాని, మీ తరఫున న్యాయవాది ద్వారా గాని హాజరు కావలయును. అట్లు హాజరుకాని పక్షాన మీకు ప్రతికూలంగా తీర్పు వచ్చునని తెలియపరచడమైనది.
జె.ఎం.గౌరిశంకర్ రాజు, M.A., LLB
వాది తరఫు న్యాయవాది, పాకాల.

ముక్కంటి సేవలో రాష్ట్ర ఎన్నికల అధికారి

శ్రీకాళహస్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ కేఆర్‌బీహెచ్‌ఎన్ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



పరశురామేశ్వరుడి సేవలో కంచికామకోటి విద్యార్థులు

ఏర్పేడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురమేశ్వరుడిని సోమవారం చంద్రగిరి మండలం తొండవాడ వద్ద ఉన్న కంచి కామకోట పీఠాధిపతి కళాశాలకు చెందిన సుమారు 108మంది విద్యార్థులు దర్శించుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా భోగి ఉత్సవం



నారాయణవనం, జనవరి 13: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భోగి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు తిరుప్పావైతో వెంకన్నన మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట భోగి మంటలు వేశారు. సాయంత్రం గోదాదేవి(ఆండాళ్) సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై పట్టణంలో ఊరేగించారు. అనంతరం ఆస్థాన మండలంలో భోగి ఆస్థానం నిర్వహించారు.

పరశురామేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఏర్పేడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిందేపల్లిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి కూడా ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నాభిషేకం నిర్వహించారు.

పల్లె గూటికి పండుగొచ్చింది

ఇంటింటా భోగభాగ్యాల భోగి మంటలు



వరదయ్యపాళెం, శ్రీకాళహస్తి పట్టణంలోని వెలంపాళెం, కొత్తగొల్ల కండ్రిగలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న భోగి

సత్యవేడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పల్లె గూటికి పండుగొచ్చింది... సంక్రాంతి శోభతో ఊరుకు సంబరమొచ్చింది... వరుణిడితో కలిసి తరలి వచ్చిన భోగి చిరుజల్లై కురిసింది... భోగి మంటల మాటున హరివిల్లై విరిసింది... ఇంటి లోగిళ్ళలో ముగ్గులు ముత్యమై మురిసింది.. స్వాగతమంటూ సంక్రాంతికి ఆహ్వానం పలికింది. మండలంలో భోగి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం వేకువజామునుంచే ఇళ్ల ముందు భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. భోగి మంటల్లో నీళ్ళను కాచి ఇంటిల్లిపాది అభ్యంగ స్నానమాచరించారు. భోగి పారంభానికి ముందే వర్షం ప్రారంభం కావడంతో భోగి మంటలకు ఆటంకం కలిగింది.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): భోగిపండుగ వర్షం కారణంగా కొంత సందడి తగ్గింది. వేకువజామున మూడు గంటలకు శ్రీకాళహస్తిలో జోరువాన కురవడంతో చలి తీవ్రత పెరిగింది.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటింటా భోగ భాగ్యాల భోగి మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. గత పది రోజులుగా యువకులు సేకరించిన భోగి కంపను డప్పు వాయిద్యాలు మధ్య మంటించారు. ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లి సంక్రాంతి కోసం వచ్చిన బంధుగణాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు.

కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): భోగభాగ్యాల భోగిపండుగకు వర్షం స్వాగతం పలికింది. ప్రజలు వర్షంలోనే భోగి వేశారు. మహిళలు తమ ఇంటి ముంగిట అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు.

బుచ్చినాయుడుకండ్రిగ(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెల్లవారుజామున వర్షం కురవడంతదో భోగికి అంతరాయం కలిగింది. ప్రతి ఇంటి వద్ద పెద్ద ఎత్తున భోగి వేయడానికి సిద్ధం చేసుకున్నారు. అయితే తెల్లవారు జామున 4గంటలకు వర్షం మొదలు కావడంతో భోగి వేయలేకపోయారు. వాన తగ్గిన గంట తరువాత భోగి వేశారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా భోగిపండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజామునే సేకరించిన కర్ర పుల్లలు, పాతవస్తువులను పేర్చి ఇంటి ముందు భోగిమంట వేశారు. ఆ మంటల్లో నీటిని కాచి తలారా స్నానమాచరించారు. కొత్త దుస్తులు ధరించి ఉల్లాసంగా గడిపారు.

గౌరమ్మలకు పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలంపాళెంలో గౌరమ్మలకు సోమవారం పూజలు నిర్వమించారు. ఇక్కడ ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వీధిలో ముగ్గురు గౌరమ్మలను ఏర్పాటు చే సి గొబ్బిపాటలు పాడారు. చిన్నా పెద్దాతేడా లేకుండా పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవం మూడు రోజులపాటు జరగనుంది. బుధవారం అర్ధరాత్రి నిమజ్జనంతో ఈ వేడుక ముగుస్తుంది.

చక్రేశ్వరస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో కొలువై ఉన్న చక్రేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు.

కైలాసగిరులను అభివృద్ధి చేయండి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మల్లికార్జుననాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కైలాస గిరులను తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌ను ఎంజీఎం గ్రూప్ అధినేత గుడ్లూరు మల్లికార్జుననాయుడు కోరారు. ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి రుద్రాక్ష మాలను అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునాయుడు మాట్లాడుతూ... శ్రీకాళహస్తి కైలాస గిరుల్లో 1,500 ఎకరాల చదునైన స్థలం ఆలయానికి ఉందని దానిని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కల అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్త కన్నప్ప వంతెన నుంచి హోటల్ ఎంజీఎం గ్రాండ్ వరకు కైలాసగిరుల్లో 40 అడుగుల రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అలాగే స్వర్ణముఖికి ఇరువైపులా సుందరీకరణ చేసి ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తామన్నారు.

వైభవంగా ఆరుద్ర ఉత్సవం

నారాయణవనం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సముదాయంలో కొలువై ఉన్న టీటీడీ అనుబంధ ఆలయమైన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు శివగామీ సమేత నటరాజస్వామిని దర్శించుకున్నారు. ధనుర్మాసంలో శివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర రోజైన సోమవారం వేకువ జామున 3 గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామికి మహాన్యాస పూర్వ అభిషేకాన్ని నిర్వహించి, ధనుర్మాస పూజలను నైవేద్యాలను సమర్పించారు. అనంతరం నటరాజస్వామిని ప్రత్యేక ఆరుద్ర అభిషేకాలను పూర్తి చేసి, భక్తుల దర్శనార్థం మండపంలో ప్రతిష్ఠింపజేశారు. అలాగే కైలాసకోనలో కొలువైఉన్న కైలాసనాథుడికి, పాలమంగళంలోని పాలీశ్వరస్వామికి, తుంబూరులోని తుంబీశ్వరస్వామికి ఆరుద్ర అభిషేకాలు నిర్వహించారు.

భోగిలో విద్యుత్ బిల్లులు

కేవీబీపురం/ రేణిగుంట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి, కొత్తూరు, రాయపేడు, కస్తూరిపురం ఎస్టీకాలనీల్లో సీపీఎం నాయకుడు దాసరి జనార్దన్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ బిల్లులకు నిరసనగా వాటిని భోగిమంటల్లో వేశారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి గెలిచిన తరువాత చార్జీలు పెంచి పేదలపై భారం మోపడం ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమని విమర్శించారు. రేణిగుంటలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓ.వెంకటరమణ, రాధాకృష్ణ, వెంకటేష్, సెల్వరాజ్, కుప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

నారాయణవనం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని తుంబూరు ఎస్సీ కాలనీకి చెందిన జగదీష్(27) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తుంబూరు నుంచి పుత్తూరుకు బయలుదేరారు. అదే సమయంలో పుత్తూరు నుంచి ఊత్తుకోటకు వెళుతున్న లారీ జగదీష్‌ను ఢీకొనింది. ఈ ఘటనలో జగదీష్ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు గుర్తించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ జగదీష్ మృతి చెందారు. ప్రమాదనికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద ముక్కంటి స్టాల్



ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద శ్రీకాళహస్తీశ్వరాలయ విక్రయశాల

శ్రీకాళహస్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రెండురోజుల పాటు ఈ స్టాల్ కొనసాగనుంది. ఇందులో స్వామివారి లడ్డూ, వడ సహా ఇతర ప్రసాదాలు, ఆలయ క్యాలెండర్లు, ల్యామినేషన్ ఫొటోలపేటను విక్రయానికి ఉంచారు. పలువురు కొనుగోలు చేసినట్టు స్టాల్ పర్యవేక్షకుడు విజయసారధి తెలిపారు.

జానపద కళల సంబరం సంక్రాంతి

కవి సమ్మేళనంలో కవులు



హాజరైన కవులు, సమాఖ్య సభ్యులు

శ్రీకాళహస్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జానపద కళల సంబరం సంక్రాంతి అని రచయిన గొడుగుచింత గోవిందయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి ఆధ్వర్యంలో సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు మాట్లాడుతూ.. పండుగలు వారసత్వ సంపదలని వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పలువురు కవులు సంక్రాంతి విశిష్టత, తెలుగు భాష ఔన్నత్యం, సంస్కృతీసంప్రదాయాలు, సమకాలీన అంశాలపై స్వీయ కవితలు వినిపించారు. టి.వెంకటయ్య, గురునాథం, బాలముని, శివకుమార్, పి.మునిసుబ్బారెడ్డి, షణ్ముగం, చెంచుకృష్ణపిళ్లై, వెంకటస్వామి, రాధాకృష్ణ, గాంధీ, భాస్కర్, శ్రీహరి, రవి, పద్మనాభం, జగదీష్, చెంగారెడ్డి పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

మనుబోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పోలీసులను ఢీకొట్టి పరారైన కేసులో నిందితుడు శెట్టిపల్లి దామోదరంను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. గతేడాది ఆగస్టు 23న వెంకటాచలం టోల్‌గేట్ వద్ద నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు వాహనాలు తనిఖీ చేస్తుండగా వైజాగ్ నుంచి తిరుపతి, చెన్నైలకు గంజాయిని తరలిస్తున్న కారును ఆపగా డీఎస్పీని ఢీకొట్టి అందులో ఉన్న సత్యనారాయణ, దామోదరం పారిపోయారు. ఏ1గా ఉన్న సత్యనారాయణను పోలీసులు అరెస్టు చేయగా, దామోదరం పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలింపుచర్యలు చేపట్టగా మనుబోలు సమీపంలో సంచరిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం రాత్రి పొదలకూరు సీఐ అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దామోదరం చిత్తూరు జిల్లా వడమాలపేట మండలం వెంకటరెడ్డి కండ్రిగకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అరుద్ర నక్షత్రం, భోగి, పౌర్ణమి వంటి అత్యంత శుభకరమైన తిథి రోజున పట్టణంలోని భవానీ శంకర ఆలయంలో వేదమంత్రాలతో మహా రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం వేకువ జామున మహాలింగానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ జరిగిన అభిషేకానికి భక్తులు పోటెత్తారు. అర్చకుడు శివ, సాయి ఆధ్వర్యంలో మహాశివుని లింగాన్ని పూలమాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మంగళ హారుతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రాసాదాలు అందజేస్తూ, అన్నదానం చేశారు.

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం



పుత్తూరు టౌన్, జనవరి 13: పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాధుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గోదాదేవికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేసి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి రంగనాథుడి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారు లుగా సాయిరాం ట్రావెల్స్ హిమచలబాబు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాళ్వాకం క్రిష్ణప్ప మెదలియార్, సభ్యులు దామోదరం, మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంక్రాంతిని పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్, శల్యవైద్యులు ప్రకాష్‌రాజు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

వాడవాడలా భోగి మంటలు

పుత్తూరు టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సోమవారం భోగి పండుగను వైభవంగా చేసుకున్నారు. ప్రజలు వేకువ జామున లేచి ఇంటి ముందు భోగి మంటలు వేశారు. అనంతరం భోగి మంటల చుట్టూ తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు.